చెంగిచెర్లలో వైభవంగా గణేశ్ నిమజ్జనం



దశ ఓయూ: గణేశ్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా చెంగిచెర్ల చౌరస్తాలో మంగళవారం గణేశ్ నిమజ్జన ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పువ్వులతో విఘ్నేశ్వరుని అలంకరించి, వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేసి..బ్యాండ్‌మేళాలతో ఊరేగిస్తూ జైబోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ భక్తులు ఉత్సాహంగా తరలించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కాలనీలకు చెందిన మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. చెంగిచెర్ల వీధుల్లో సాగిన నిమజ్జన ఊరేగింపు భక్తులకు కనుల పండుగా నిలిచింది.

ఉప్పల్‌లో ఉత్సాహంగా SIR ఫేస్2 స్పెషల్ డ్రైవ్

❖ *ఓటరు నమోదులో పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత*



దశ ఓయూ: రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో SIR ఫేస్2 స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. ఉప్పల్ నియోజకవర్గం BLA1 పోతగాని గోపాల్‌గౌడ్ అధ్యర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ స్పెషల్ డ్రైవ్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమని, అర్హులైన యువత పెద్ద సంఖ్యలో ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని ఫారం6లను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేశారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జి చంద్రమౌళి, హన్మంత్ బిరాదర్, గందమల్ల గోపి, రాజిరెడ్డి, వేణుగోపాల్, క్రాంతికుమార్, లింగం, మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

దశ, చిన్నం బావి : చిన్నంబావి మండల కేంద్రంలోని వెలగొండ గ్రామంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. విత్తనాల చట్టం, ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు, పురుగుమందుల చట్టం ప్రకారం తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను వివరించారు. దుకాణాల్లోని నిల్వ రిజిస్టర్లు, బిల్లుల పుస్తకాలు, కొనుగోలు పత్రాలను సక్రమంగా నిర్వహించాలని డీలర్లకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతులకు విక్రయించరాదని స్పష్టం చేశారు.కాలం చెల్లిన, నిషేధిత పురుగుమందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని హెచ్చరించారు. దుకాణాల్లో నిల్వ వివరాల బోర్డు, ధరల పట్టికను రైతులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని తెలి పారు.

పాఠశాలల పర్యవేక్షణలో రాజీ లేదు: అదనపు కలెక్టర్ కిరణ్మయి

దశ, రంగారెడ్డి : పాఠశాలల నిర్వహణ, విద్యా ప్రమాణాల మెరుగుదల, ఉపాధ్యాయులు-విద్యార్థుల హాజరు విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRPs, APIT బృందాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదు, FLN, పాఠశాలల సందర్శనలు, అభ్యసన ఫలితాలపై సమీక్షించారు.

FRS హాజరు తప్పనిసరి: ప్రతి ఉపాధ్యాయుడు ప్రతిరోజూ ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా హాజరు నమోదు చేయాలని కిరణ్మయి ఆదేశించారు. సరైన కారణం లేకుండా హాజరు నమోదు చేయని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. విద్యార్థుల హాజరును పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

UDISE+లో పెండింగ్ ఉండకూడదు:

UDISE+ డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలను వెంటనే సంబంధిత పాఠశాలల్లోకి ఇంపోర్ట్ చేయాలని, ఒక్క



విద్యార్థి వివరాలు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. మండలాలు, కాంప్లెక్స్‌ల వారీగా నమోదు, హాజరు ప్రగతిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు.

PARAKHకు ప్రత్యేక శిక్షణ:

రాబోయే PARAKH, ఇతర ప్రామాణిక అసెస్‌మెంట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 2, 5, 8 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తరగతి వారీగా నిర్దేశించిన అభ్యసన సామర్థ్యాలను విద్యార్థులు సాధించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు.

FLN కాంపిటెన్సీ అసెస్‌మెంట్ ఫలితాలను విశ్లేషిస్తూ గణిత సామర్థ్యాల్లో విద్యార్థులు మెరుగైన ప్రగతి సాధిస్తున్నట్లు అధికారులు వివరించారు. భాషా సామర్థ్యాలను కూడా పెంపొందించేలా ప్రత్యేక బోధనా చర్యలు చేపట్టాలని కిరణ్మయి సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ అందించాలని ఆదేశించారు.

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, APIT బృందాలు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి లోపాలను గుర్తించడంతో పాటు ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ మార్గదర్శకత్వం అందించాలని ఆమె సూచించారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని పిలుపునిచ్చారు.



అనుమతి లేని నిర్మాణాలపై ఎంఎంసీ ఉక్కుపాదం

❖ *నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత*

దశ, పెద్ద అంబర్‌పేట్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) నాగోల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా, మున్సిపల్ ప్లాన్‌కు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. అనుమతించిన ప్లాన్ దాటి చేపడుతున్న నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. కుంట్లూర్ చౌరస్తా సమీపంలో స్టిల్ట్+2 అంతస్తులకు అనుమతి ఉండగా, అదనంగా మూడో అంతస్తు నిర్మాణానికి ఏర్పాటు చేసిన పిల్లర్లను పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూల్చివేశారు.

అలాగే పెద్ద అంబర్‌పేట్-పసుమాముల రోడ్డు సమీపంలో అనుమతి లేకుండా అదనపు అంతస్తు నిర్మాణం చేపడుతుండగా, పైఅంతస్తు పిల్లర్లతో పాటు స్లాబ్ కోసం ఏర్పాటు చేసిన సెంటరింగ్ సామగ్రిని తొలగించారు. మున్సిపల్ అనుమతులు లేకుండా లేదా అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు భవన యజమానులు, బిల్డర్లను హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను గుర్తించిన వెంటనే కూల్చివేత చర్యలు చేపడతామని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాలతో, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రతాప్ పర్యవేక్షణలో కూల్చివేతలు చేపట్టారు. వార్డు ఆఫీసర్లు సాయి కృష్ణ, సాయి తేజ, చైన్మన్లు రాజు, మహేష్, తరుణ్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



దశ, జగిత్యాల/ వెల్గటూర్: వెల్గటూర్ మండల ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఈ ఎన్నికను ఏర్పాటు చేయగా ..వెల్గటూర్ మండల ప్రజా ప్రతినిధులు , సర్పంచ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేరకు మండల "జై హనుమాన్ డీజిల్ ,ఆటో ఓనర్స్ & డ్రైవర్స్ యూనియన్ " మండల గౌరవ అధ్యక్షుడిగా అనుమాల నారాయణ, అధ్యక్షులు గా సంగ రాజమౌళి , ఉపాధ్యక్షులుగా నక్క ప్రసాద్, కోటేశ్వరరావు లు,ప్రధాన కార్యదర్శి గా కుశనపల్లి దుర్గయ్య, జాయింట్ సెక్రటరీ లు గా మాదాసు అశోక్, మీరాల రమేష్, కోశాధికారి బిడారి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ గా కుశనపల్లి నర్సయ్య, సల్లూరి లచ్చయ్య, సైధం తిరుపతి, కర్ణ మామిడి శ్రీనివాస్, గాజుల సత్తయ్య, గుమ్ముల రాజయ్య, అంకం సురేష్, బండమీది శేఖర్, కుశనపెల్లి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష ఉపాధ్యక్షులు మాట్లాడుతూ... ఆటో డ్రైవర్ ల సంక్షేమం కోసం కృషి చేస్తామని, ఆటో కార్మికుల కష్టాలను ప్రభుత్వానికి తెలియజేస్తూ యూనియన్ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ సర్పంచ్ బండమీది కవిత గోపి, ఏఎంసీ చైర్మన్ గోల్ల తిరుపతి, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, కాంగ్రెస్ నాయకులు మెరుగు నరేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి, మాజీ సర్పంచ్ బండమీది ముత్తయ్య, మాల సంఘం అధ్యక్షుడు మూగల సతీష్, భూసార్తి గంగారాం లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



నగర శివారులో అక్రమ కార్యకలాపాల నియంత్రణకు కఠిన చర్యలు

❖ *పోలీసులకు, అధికారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశం.*

❖ *రైతులకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచన.*

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారులో అక్రమ కార్యకలాపాల నియంత్రణపై పోలీసులు, అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధికారులతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర శివారులో చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైన చోట పోలీసు సిబ్బందిని పెంచేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. రైతులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చౌటుప్పల్ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు



❖ *డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి*

దశ, చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. 'నగరాభివృద్ధి' పథకం కింద రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రూ.8.50 కోట్లతో డ్రైనేజీ పనులు:

వార్డు 13లో రూ.7 కోట్లతో వాలిగొండ రోడ్డు కల్వర్టు, దివి చెరువు, బాలకుసుమ డిజిటల్స్, కేజీబీవీ పాఠశాల నుంచి బీసీ హాస్టల్ వరకు డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. వార్డు 14లో రూ.కోటి వ్యయంతో నాగులకుంట కింగ్స్ హాస్పిటల్ నుంచి మల్లికార్జున స్కూల్ వరకు, వార్డు 10లో రూ.50 లక్షలతో ముత్యాలపాపిరెడ్డి స్థలం నుంచి జెల్లా నాగయ్య ఇంటి వరకు డ్రైన్ నిర్మాణాలు చేపట్టనున్నారు.

రూ.6.50 కోట్లతో సీసీ రోడ్లు:

వార్డులు 8, 9లో రూ.2.50 కోట్లతో జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల, బ్రహ్మంగారి గుడి, లక్కారం, ఆర్డీఓ కార్యాలయం పరిసరాల్లో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. వార్డు 14లో రూ.కోటి వ్యయంతో ఎర్రగోరి నుంచి కాటమయ్య కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే మున్సిపాలిటీలోని 1 నుంచి 20 వార్డుల్లో వివిధ ప్రాంతాల్లో రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ గోషిక వినయ్‌కుమార్, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ మనోరమ, ఏఈ నితీష్‌తో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా శ్రీపతి నరసయ్య

❖ *కుల వివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి కృషి*

❖ *నియామక పత్రం అందజేసిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ*

దశ, హైదరాబాద్: జాతీయ మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా శ్రీపతి నరసయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నరసయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయనను జ్ఞాపికతో సత్కరించి, శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీపతి నరసయ్య మాట్లాడుతూ కుల వివక్షకు తావులేని సమాజ నిర్మాణం, మాదిగల సమగ్ర అభివృద్ధి, పీడిత వర్గాల విముక్తి లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చూపిన ఉద్యమ బాటలో తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మాదిగ ఉద్యోగులు, మాదిగల సర్వతోముఖ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నరసయ్య స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలు, సామాజిక హక్కులు, విద్యా-ఉద్యోగ అవకాశాలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంఈఎఫ్‌ను మరింత బలోపేతం చేస్తూ ఉద్యోగులు, సామాజిక వర్గాల సమస్యలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ అధ్యక్షులు బొంత యేసుదాసు, జాతీయ అధ్యక్షులు బిక్షాలు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మందా దేవేంద్ర ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు చెంబట్టి యాదగిరి తదితరులు పాల్గొని శ్రీపతి నరసయ్యకు అభినందనలు తెలిపారు.

